క్లుప్తంగా

పన్ను బకాయిలు చెల్లిస్తే వడ్డీ మాఫీ

కర్నూలు (టౌన్) : 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను బకాయిలు చెల్లించి వడ్డీ మాఫీని పొందాలని నగరపాలక మేనేజర్ చిన్నరాముడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలవు రోజుల్లోనూ పన్ను చెల్లింపు కౌంటర్లు పనిచేస్తాయని తెలిపారు. వడ్డీమాఫీ గడువు ఈనెల 31 వ తేదీతో ముగుస్తుందని తెలిపారు.

స్టేడియానికి నాణ్యత లేని మట్టి

● శాప్ సిబ్బందిపై డీఎస్‌డీఓ ఆగ్రహం



స్టేడియానికి తరలించిన రాళ్లు రప్పలతో అధ్వానంగా ఉన్న మట్టి

కర్నూలు (టౌన్): ప్లే ఫీల్డ్‌లను అభివృద్ధి చేయాలని శాప్ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్) నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో వాలీబాల్, ఖో-ఖో, కబడ్డీ ఫీల్డ్‌లలో మట్టిని ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే స్టేడియానికి చేరుకున్న మట్టి అధ్వానంగా ఉంది. రాళ్లు, రప్పలు ఉన్నాయి. నాణ్యత కూడా సరిగా లేదు. దీంతో శాప్ సిబ్బందిపై జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్వాలిటీ లేకుంటే క్రీడాకారులకు ఇబ్బందులు వస్తాయని చెప్పారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు.

ఎమ్మార్పీకే వస్తువులు విక్రయించాలి

శ్రీశైలంటెంపుల్: ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల క్షేత్ర పరిధిలోని దుకాణదారులు ఎమ్మార్పీకే వస్తువులను విక్రయించాలని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణ అధికారి డి.పెద్దిరాజు సూచించారు. శుక్రవారం దేవస్థాన పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో క్షేత్ర పరిధిలోని దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 6 నుంచి 10వ తేదీ వరకు జరగనున్న ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని కర్ణాటక, మహారాష్ట్ర నుంచి లక్షల సంఖ్యలో భక్తులు క్షేత్రాన్ని సందర్శిస్తారన్నారు. దుకాణదారులు భక్తులతో మర్యాదగా మెలగాలన్నారు. దుకాణదారులు, హోటల్ నిర్వాహకులు శుచీ, శుభ్రతలను పాటించాలన్నారు. ఆహార పదార్థాలపై, తినుబండరాలపై తప్పనిసరిగా మూతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దుకాణాల వద్ద వస్తువుల ధరల పట్టికను ప్రదర్శించాలన్నారు. శ్రీశైలం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు మాట్లాడుతూ దుకాణాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో శ్రీశైలం ఎస్ఐ లక్ష్మణరావు, దేవస్థాన రెవెన్యూ ఏఈఓ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే క్రమశిక్షణ చర్యలు



సమీక్ష నిర్వహిస్తున్న ఏపీ నేర విభాగం డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

కర్నూలు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర, జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులలో తనిఖీలు విస్తృతం చేయాలని, ఎవరైనా అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో నేర విభాగం ఏపీ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య సెబ్ సిబ్బందిని ఆదేశించారు. జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్, ఏఈఎస్ వినోద్‌కుమార్‌తో కలసి శుక్రవారం పంచలింగాల, సుంకేసుల చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. అనంతరం కర్నూలు సెబ్ స్టేషన్ చేరుకుని రికార్డులను పరిశీలించారు. సెబ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో అధికారులతో సమావేశమై సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. పాత నేరస్తులను బైండోవర్ చేయాలని ఆదేశించారు. అక్రమ మద్యం సరఫరా మార్గాల్లో రూట్‌వాచ్ చేపట్టాలన్నారు. సమావేశంలో డీటీఎఫ్ సీఐ నరసనాయుడు, కర్నూలు సెబ్ స్టేషన్ సీఐ కేఆర్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో శుక్రవారం నిర్వహించిన మేమంతా సిద్ధం సభలో వైఎస్సార్‌సీపీ కర్నూలు, కోడుమూరు నియోజకవర్గాల ఎమ్మెల్యే అభ్యర్థులుగా ఇంతియాజ్‌బాషా, డాక్టర్ ఆదిమూలపు సతీష్‌లను ప్రజలకు పరిచయం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



రెండేళ్ల తర్వాత వచ్చే రాజ్యసభ ఎన్నికల్లో ముస్లిం కోటా నుంచి కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌ను రాజ్యసభకు పంపుతానని మేమంతా సిద్ధం సభలో ప్రకటిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

చిన్నారులకు టీకా రక్ష!

- పిల్లల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
- ప్రతి ఏటా వందశాతం టీకాకీరణకు చర్యలు
- అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా టీకాలు
- గ్రామాల్లో బుధ,శనివారాల్లో వ్యాక్సినేషన్

చిన్నారుల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. భవిష్యత్‌లో ఏ ఒక్కరూ వ్యాధుల బారిన పడి వైకల్యం చెందకుండా, ప్రాణాంతక వ్యాధులకు గురికాకుండా చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా అప్పుడే పుట్టిన శిశువు నుంచి 16 ఏళ్ల పిల్లల వరకు ముందు జాగ్రత్తగా వ్యాక్సిన్లు/ టీకాలు వేయిస్తూ రక్షణ కల్పిస్తోంది. ప్రభుత్వం ఉచితంగా నిర్వహించే టీకాకీకరణ ప్రతి సంవత్సరం జిల్లాలో వంద శాతం జరుగుతుండటం విశేషం.

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలోని 25 మండలాల్లో 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఐదు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 300ల దాకా ఉప ఆరోగ్యకేంద్రాలు, 20 దాకా పట్టణ ఆరోగ్య కేంద్రాలున్నాయి. ఆయా ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి బుధ, శనివారాల్లో వ్యాక్సిన్ డే నిర్వహిస్తున్నారు. ఏఎన్‌ఎం/ఆరోగ్య కార్యకర్తలు గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి చిన్నపిల్లలకు టీకాలు వేస్తున్నారు. ఈ టీకాల వల్ల భవిష్యత్తులో వారికి ధనుర్వాతం, క్షయ, కోరింత దగ్గు, పోలియో, రోటావైరస్, హెపటైటిస్-బి, హ్యూమోక్యులెస్ ఇన్‌ఫ్లూయింజా, డయేరియా, చికెన్‌ఫాక్స్, టైఫాయిడ్, గవదబిళ్లలు వంటి వ్యాధుల నుంచి రక్షణ లభిస్తోంది. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ టీకాలను అవసరం మేరకు ప్రతి ఆరోగ్య కేంద్రానికి జిల్లా ఇమ్యునైజేషన్ కేంద్రం నుంచి అధికారులు చేరవేస్తున్నారు. ఆయా కేంద్రాల్లో టీకాలు నిల్వ ఉంచేందుకు వీలుగా అవసరమైన ఫ్రిడ్జ్‌లు కూడా ఏర్పాటు చేశారు. అప్పుడే పుట్టిన శిశువుల నుంచి పిల్లల వరకు, గర్భిణిలకు గత నాలుగేళ్లుగా వందశాతానికి పైగా వ్యాక్సినేషన్ పూర్తి చేస్తున్నారు.

పిల్లలకు వేసే టీకాలు ఇలా !

- శిశువు జన్మించిన సమయంలో బీసీజీ, ఓపీవీ-జీరో మోతాదు, హెపటైటిస్-బి
- ఆరు వారాలకు ఓపీవీ-1, పెంటావాలెంట్-1, రోటా-1, ఎఫ్ఎల్‌పీవీ-1, పీసీవీ-1
- 10 వారాలకు ఓపీవీ-2, పెంటావాలెంట్-2, రోటా-2
- 14 వారాలకు ఓపీవీ-3, పెంటావాలెంట్-3, రోటా-3, ఎఫ్ఎల్‌పీవీ-2, పీసీవీ-2
- 9 నెలలకు మీజిల్స్-1/ఎంఆర్-1, విటమిన్-ఎ, జేఈ-1, పీసీవీ-బి -16నుంచి 24 నెలల్లో డీపీటీ మొదటి బూస్టర్ డోసు, ఓపీవీ బూస్టర్ డోసు, మీజిల్స్-2/ఎంఆర్-2, జేఈ-2
- 5 నుంచి ఆరు సంవత్సరాలకు డీపీటీ రెండో బూస్టర్ మోతాదు
- 10, 16వ సంవత్సరంలో టీడీ వేస్తారు.

జిల్లాలో ఐదేళ్లుగా వ్యాక్సినేషన్ ఇలా...

వ్యాక్సిన్	2019-20	2020-21	2021-22	2022-23	2023-24
బీసీజీ	65,743	78,504	42,401	55,465	39866
ఓపీవీ జీరో దోస్	63,752	78,504	42,401	49,864	39109
హెపటైటిస్-బి జీరో దోసు	63,710	62,602	42,401	45,006	37587
ఓపీవీ థర్డ్ దోసు	68,491	78,504	42,401	45,006	42296
పెంటావాలెంట్ థర్డ్ దోస్	68,550	70,786	48,742	45,006	46437
మీజిల్స్/ఎంఆర్	70,208	70,963	48,563	44,014	46148
విటమిన్-ఎ మొదటి దోసు	67,199	70,161	47,237	44,014	45,090
పూర్తి టీకాలు తీసుకున్న ఏడాదిలోపు పిల్లలు	70,208	70,874	48,563	44,014	45,998
పూర్తి టీకాలు తీసుకున్న 1 నుంచి 5లోపు పిల్లలు	60,266	66,485	43,888	39,270	40,989



చిన్నారులకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

చిన్నారులకు తప్పనిసరిగా వ్యాక్సిన్



అప్పుడే పుట్టిన శిశువుల నుంచి వారు పెద్దయ్యే వరకు వారికి ఎలాంటి అనారోగ్య సమస్యలు రాకుండా ఉండేందుకు టీకాలు ఇస్తున్నాము. ఇందుకు సంబంధించి అవసరమైన అన్ని రకాల వ్యాక్సిన్లు, టీకాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా వేస్తున్నారు. ఏఎస్‌ఎంలు ప్రతి బుధ, శనివారాల్లో గ్రామాలకు వెళ్లడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రతిరోజూ చిన్నారులకు వ్యాక్సిన్ అందిస్తున్నారు.

-డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, డీఎంహెచ్‌ఓ, కర్నూలు

ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్ష



చిన్నారులకు సకాలంలో టీకాలు వేయడం వల్ల వారికి భవిష్యత్‌లో ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. పిల్లల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అతి ఖరీదైన నీమోకోకల్, పీసీవీ, ఐపీవీ, రోటావైరస్ లాంటి వ్యాక్సిన్‌లను ఆసుపత్రిలో ఉచితంగా ఇస్తున్నాము. వ్యాక్సిన్ పది నిమిషాల ముందు, పది నిమిషాల తర్వాత మాత్రమే బిడ్డకు తల్లి పాలివ్వాలి.

-డాక్టర్ విజయానంద్‌బాబు, పీడియాట్రిక్స్ హెచ్‌ఓడీ, జీజీహెచ్, కర్నూలు

డీఆర్‌డీఏ సిబ్బంది పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనొద్దు

● డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ సలీమ్‌బాషా

కర్నూలు(అగ్రికల్చర్): ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున డీఆర్‌డీఏ-వైకేపీలో ప్రభుత్వం నుంచి వేతనాలు తీసుకుంటున్న వారు ఎలాంటి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనరాదని ప్రాజెక్టు డైరెక్టర్ సలీమ్‌బాషా తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... గ్రామ సంఘం సహాయకులు మొదలు అన్ని స్థాయిల వారు ఎన్నికల్ కోడ్ అమలులో ఉన్న సమయంలో రాజకీయ పార్టీలకు వత్తాసు పలకడం, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం చేయరాదన్నారు. కోడ్‌కు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వెల్దుర్తి మండలంలో కోడ్ ఉన్న సమయంలో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్న ఇద్దరు గ్రామ సంఘం సహాయకులు(బుక్ కీపర్లు) కె.సుధాకర్, చిన్నరంగన్నలను విధుల నుంచి పూర్తిగా తొలగించినట్లు తెలిపారు. ఏప్రిల్ నెలకు సంబంధించి 3వ తేదీ నుంచి పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందని, పింఛన్ల పంపిణీలో ఎలాంటి ప్రచారం ఉండరాదని, ఫొటోలు, వీడియోలు తీయకుండా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. యథాతథంగా వలంటీర్లే పింఛన్లు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

పాణ్యం: కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శనివారం హుండీ కానుకల లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఈఓ రామక్రిష్ణ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉదయం 9 గంటలకు లెక్కింపు ప్రారంభిస్తామని చెప్పారు.

30 నుంచి పీఓలు, ఏపీఓలకు శిక్షణ

కర్నూలు(కల్చరల్): సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈనెల 30, ఏప్రిల్ 1 తేదీల్లో పీఓలు, ఏపీఓలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై కలెక్టర్ శుక్రవారం మధ్యాహ్నం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సుంకేసుల రోడ్డులోని ఎమ్మార్పీ కన్వెన్షన్ హాల్‌లో నాలుగు సెషన్లలో 8 నియోజకవర్గాలకు శిక్షణ నిర్వహిస్తామన్నారు. జిల్లాలో మొత్తం పీఓలు, ఏపీఓలు 5,357 మందిని నియమించగా.. ఇందులో 176 మంది రిటైర్మెంట్ తదితర కారణాల వల్ల ఆర్డర్స్ సర్వ్ చేయలేదన్నారు. మిగిలిన వారందరికీ శిక్షణనిస్తామని, హాజరు కాకపోతే చర్యలు తప్పవన్నారు. టెలి కాన్ఫరెన్స్‌లో జేసీ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో మధుసూదన్ రావు, ఆదోని రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ, కోడుమూరు రిటర్నింగ్ అధికారి, కర్నూలు ఆర్‌డీఓ శేషిరెడ్డి, పత్తికొండ రిటర్నింగ్ అధికారి, ఆర్‌డీఓ రామలక్ష్మి పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి దోహదపడాలి

● దేశీ శిక్షణ కార్యక్రమంలో ఇన్‌పుట్ డీలర్లతో ఆత్మ పీడీ పీఎల్ వరలక్ష్మి



ఇన్‌పుట్ డీలర్లకు నిర్వహిస్తున్న పరీక్షను పర్యవేక్షిస్తున్న ఆత్మ పీడీ, డీపీడీలు

కర్నూలు(అగ్రికల్చర్): రైతుల పట్ల సేవాభావం కలిగి వారి అభ్యున్నతికి దోహదపడాలని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి అన్నారు. స్వార్థం,లాభాపేక్ష లేకుండా రైతులకు అన్ని విధాలా సహకరించాలని ఇన్‌పుట్ డీలర్లకు సూచించారు. శుక్రవారం వ్యవసాయ శాఖ కర్నూలు ఏడీఏ కార్యాలయంలో దేశీ డిప్లొమ కోర్సుపై ఇన్‌పుట్ డీలర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ పీఎల్ వరలక్ష్మి మాట్లాడుతూ... దేశీ కార్యక్రమం ద్వారా ఇన్‌పుట్ డీలర్లకు వ్యవసాయ పరిజ్ఞానం, ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల చట్టాలు, ఆహార కల్తీ నియంత్రణ చట్టాలు తదితర వాటిపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. తెలుసుకున్న వాటిని రైతులకు వివరించి నాణ్యమైన ఇన్‌పుట్ అందే విధంగా తోడ్పాటు ఇవ్వాలని పేర్కొన్నారు. ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలత మాట్లాడుతూ... ఆహార కల్తీ ఎలా జరుగుతుంది... దానిని ఎలా కనిపెట్టాలి వివరించారు. నేడు పసుపు, మిరియాలు, ఆవాలు, కారం, వంట నూనెలు ఇలా అనేకం కల్తీ అవుతున్నాయని పేర్కొన్నారు. ఆహార కల్తీ నియంత్రణ చట్టం గురించి తెలుసుకొని రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కల్తీ ఆహారం తీసుకోవడం ద్వారా తీవ్ర ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని చెప్పారు. అనంతరం ఇన్‌పుట్ డీలర్లకు డిప్లొమ కోర్సుపై పరీక్ష నిర్వహించారు. పరీక్షను ఆత్మ పీడీ వరలక్ష్మి, డీపీడీ శ్రీలత, దేశీ కోర్సు సమన్వయకర్త, విశ్రాంత జేడీఏ జయచంద్ర పర్యవేక్షించారు. కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన ఇన్‌పుట్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

27 ఏళ్లుగా మహానందీశ్వరుడి సన్నిధికి

- మొదట మహానంది, తర్వాత శ్రీశైలం
- పాదయాత్రగా వస్తున్న కన్నడ భక్తులు




మహానందిలో భజనలు చేస్తున్న మైసూరు భక్తబృందం

మహానంది: కర్ణాటక రాష్ట్రం మైసూరుకు చెందిన మైసూర్ అమ్మణ పరసే మైలాల గోచార్ సంస్థకు చెందిన భక్తులు 27 ఏళ్లుగా మహానంది, శ్రీశైలం ఆలయాలకు వస్తూ భక్తిని చాటుకుంటున్నారు. సర్వేజనా సుఖినోభవంతు అంటూ ఆ భక్తులు చేస్తున్న పాదయాత్ర అభినందనీయం. శుక్రవారం వారు మహానందికి చేరుకున్నారు. వివిధ రకాల వాయిద్యాలతో శివనామస్మరణ చేస్తూ పూజలు చేశారు. ఉగాది యాత్రలో భాగంగా పాదయాత్ర చేస్తూ గత 27 ఏళ్ల నుంచి మహానందికి వస్తున్నామని, ముందుగా మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకుని పూజలు చేసి అనంతరం శ్రీశైలం వెళ్తామని చెప్పారు. శ్రీశైలం మల్లికార్జునస్వామిని దర్శించుకుని పాదయాత్రగా స్వస్థలానికి చేరుకుంటామని చెప్పారు. మహానంది దేవస్థానం ఏఈఓ ఓంకారం వెంకటేశ్వరుడు, వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, తదితరులు వారిని అభినందించి ఆశీర్వచనాలు చేశారు.

భానుడి ప్రతాపం.. జరభద్రం

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- పొంచి ఉన్న వడదెబ్బ ప్రమాదం
- ముందు జాగ్రత్తలే రక్షణ
- డీఎంఅండ్‌హెచ్‌ఓ సూచనలు



కర్నూలు(హాస్పిటల్): వేసవి ప్రారంభంలోనే ఎండలు మండుతున్నాయి. దీంతో పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఈ క్రమంలో అజాగ్రత్తతో బయటకు తిరిగే వ్యక్తులు వడదెబ్బకు గురై ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. మరికొందరు నిర్లక్ష్యంగా ప్రాణాలు కోల్పోతున్నారు. మండే వేసవి కాలంలో తగు జాగ్రత్తలు తీసుకుంటే వడదెబ్బకు గురిగాకుండా ఉండవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెబుతున్నారు. వడదెబ్బకు గురిగాకుండా మనిషి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన వివరించారు.

వడదెబ్బ అంటే....

ఎండలు తీవ్రంగా ఉన్నప్పుడు మనిషి శరీరంలో ఉష్ణోగ్రతను నియంత్రించే కేంద్ర మండల నాడీ వ్యవస్థ దెబ్బతినడంతో వడదెబ్బ వస్తుంది. శరీర ఉష్ణోగ్రత పెరిగి మెదడు మీద ప్రభావం చూపుతుంది. వడదెబ్బ తగిలిన వారిలో 40 శాతం మరణాలు సంభవిస్తాయి. ఇది చాలా ప్రమాదకరమైనది. వేసవి కాలంలో సాధారణంగా అపాయానికి గురిచేసేది ఈ వడదెబ్బే. దానిని సన్‌స్ట్రోక్ లేదా హీట్ స్ట్రోక్ అని కూడా అంటారు. తీవ్రస్థాయిలో వడదెబ్బ తగిలితే ప్రాణాలు పోయే ప్రమాదం కూడా ఉంది. కనుక వడదెబ్బ తగిలిన వ్యక్తికి తక్షణమే వైద్య సహాయం అందించాలి.

లక్షణాలు : తలనొప్పి, తలతిరడం, నాలిక ఎండిపోవడం/పిడచ కట్టుకుపోవడం/చెమట పట్టకుండా ఉండటం, జ్వరం కలిగి ఉండటం, మగత కలవరింతలు, ఫిట్స్/పాక్షిక లేదా పూర్తి అపస్మారక స్థితి

కారణాలు: శరీరంలో ఎక్కువ వేడి ఉత్పత్తి కావడం, శరీరం ఎక్కువ ఉష్ణాన్ని కోల్పోవడం

చేయాల్సిన పనులు: వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ గల ప్రదేశానికి చేర్చాలి. అతని శరీరంపై ఉండే దుస్తులను తొలగించి చల్లని నీటితో కడగడం కానీ చల్లని నీటితో ముంచిన గుడ్డతో తుడవడం చేయాలి. ఐస్‌ముక్కలను గుడ్డతో ఉంచి శరీరాన్ని తుడిచి చల్లని గాలి తగిలేలా చూడాలి. రోగగ్రస్తులకు చల్లని నీరు లేదా ఉప్పు ఇతర లవణాలు కలిపిన నీటిని తాగించాలి. ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించాలి.

వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- సాధ్యమైనంత వరకు మిట్ట మధ్యాహ్నం ఎండలో 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తిరగకుండా జాగ్రత్త వహించాలి.
- తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సిన పరిస్థితుల్లో ఉప్పు కలిపిన మజ్జిగ లేదా ఉప్పు కలిగిన పళ్ల రసాలు తాగి బయలుదేరాలి.
- వేసవి కాలంలో తెల్లని దుస్తులు ధరించాలి. నల్లని వస్త్రాలు ధరించకూడదు.
- ఆల్కహాలు సేవించడం వల్ల రక్తనాళాలు వ్యాకోచించి ఎక్కువ చెమట వచ్చేలా చేస్తాయి. అది విషమ పరిస్థితికి దోహదం చేస్తుంది. కనుక ఆల్కహాలు సేవించరాదు.
- ఇంటి గదులు ఉష్ణోగ్రతను తగ్గించేందుకు కిటికీలకు, తలుపులకు తెరలను వాడి వేడిని తగ్గించవచ్చు. ఫ్యాన్లు, ఎయిర్ కూలర్లు, ఎయిర్ కండిషనర్లు వాడాలి.
- వేడిగా ఉన్నప్పుడు ఎండలో గొడుగు లేకుండా తిరుగరాదు.
- తప్పనిసరి పరిస్థితుల్లో మండటెండలో బయటకు వెళ్లాలంటే మంచి నీటి బాటిల్‌ను వెంట తీసుకెళ్లాలి.
- వేసవి కాలంలో బయటకు వెళ్లే అవసరం ఉంటే ఉదయం, సాయంత్రం సమయాల్లో వెళ్లేలా ఏర్పాటు చేసుకోవాలి.
- ఎండలో వెళ్లేటప్పుడు తలకు తెల్లని టోపి లేక రుమాలు ధరించాలి.

భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శుక్రవారం ఊయలసేవ నిర్వహించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశా రు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చే సి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంత రం అమ్మవారికి అష్టోత్తరం,త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అలాగే శ్రీశైలగ్రామ దేవత అంకాళమ్మకు విశేషపూజలు నిర్వహించారు.

బైక్‌పై నుంచి కింద పడి మహిళ మృతి

జూపాడుబంగ్లా: జోగులాంబ గద్వాల జిల్లాలోని మరకల్ వద్ద బైక్‌పై నుంచి కిందపడి జూపాడుబంగ్లాకు చెందిన జంగాల మాధవి(24) మృతిచెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాలు... జూపాడుబంగ్లాకు చెందిన జంగాల మాధవి, భర్త బాలరాజు యాచక వృత్తితో పాటు చిన్న చిన్న వ్యాపారాలు చేస్తూ సంచార జీవనం చేసేవారు. అందులో భాగంగా వారు జోగులాంబ గద్వాల జిల్లా మరకల్ గ్రామ సమీపంలో గుడారాలు వేసుకొని జీవిస్తున్నారు. శుక్రవారం మాధవి ఆమె తమ్ముడు కలిసి ద్విచక్రవాహనంపై వ్యాపారం ముగించుకొని ఇంటికి వెళ్తుండగా ప్రమాదవశాత్తూ కిందపడింది. తలకు తీవ్రగాయాలు కావటంతో చికిత్స నిమిత్తం 108లో తరలిస్తుండగా మృతిచెందింది. భర్త ఫిర్యాదు మేరకు అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించటంతో వారు జూపాడుబంగ్లాలో అంత్యక్రియలు నిర్వహించారు.

మానవ జాతి కోసమే ఏసు శిలువ మరణం

- భక్తి శ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే
- చర్చిల్లో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు
- శాంతి సందేశమిచ్చిన పాస్టర్లు





ప్రేమగిరిలో ప్రత్యేక ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు



బిషప్ చర్చి నుంచి శిలువ ర్యాలీ



నగరంలోని ప్రార్థన మందిరంలో భక్తి గీతాలు ఆలపిస్తున్న క్వయర్ బృందం

కర్నూలు (టౌన్): మానవ జాతి పునరుద్ధరణ కోసమే ఏసుక్రీస్తు శిలువ మరణం పొందారని పాస్టర్లు పేర్కొన్నారు. ఏసుక్రీస్తు చేసిన ప్రాణ త్యాగానికి ప్రతీకగా గుడ్‌ఫ్రైడే జరుపుకుంటారని వెల్లడించారు. శుక్రవారం గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని క్రైస్తవులు ఏసు శిలువ మరణాన్ని స్మరించుకుంటూ అన్ని చర్చిల్లో ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆనాడు శిలువలో మరణిస్తూ దేవుడు పలికిన 7 మాటలను ఘనంగా చేసుకున్నారు. నగరంలోని చర్చిలకు చిన్నారులు, పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మోకరిల్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యెహోవా షమ్మా చర్చిలో పాస్టర్ డాక్టర్ బి. స్టీఫెన్ చార్లెస్, కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు మందిరంలో పాస్టర్ అనిల్ సామేల్, పాస్కల్ పాస్టర్, సీఎస్ఐ చర్చిలో మాజీ బిషప్ పుష్ప లలితమ్మ, గిప్సన్ చర్చిలో పాస్టర్ కృపాదానం, స్టాంటన్ మెమోరియల్ చర్చిలో పాస్టర్ దేవసహాయం, పాస్టర్ విక్టర్ ఇమ్మానియేలు సి.క్యాంపు మందిరంలో పాస్టర్ కరుణాసాగర్, యేరుషాలేమ్ తదితర చర్చిల్లో ఉదయం నుంచే ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. క్రైస్తవులు ప్రత్యేక భక్తి గీతాలు ఆలపించగా..పాస్టర్లు దైవ సందేశమిచ్చారు. గణేష్‌నగర్‌లోని బిలీవర్స్ చర్చి ఆధ్వర్యంలో శిలువ ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. ఈ ర్యాలీ కేసీ కెనాల్ బ్రిడ్జి మీదుగా జొహరాపురం వరకు సాగింది. నగరంలోని స్థానిక ఆర్ఎస్ రోడ్డులోని వైఎంసీఏ హాలులో లెమెన్స్ ఇవాలెంజికల్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడే కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.